విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 27 మే 2025 8 పేజీలు

ప్రజా సమస్యలపై ఉద్యమించండి

- కమ్యూనిస్టుపార్టీకి శాఖ నిర్మాణం గుండెకాయ
- సీపీఐ క్వారీ శాఖ మహాసభలో అక్కినేని వనజ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: రాష్ట్రంలో అనేక ప్రజా సమస్యలు నెలకొని ఉన్నాయని, ప్రజల వద్దకు ప్రతి కార్యకర్త వెళ్లి వారి సమస్యలను అధ్యయనం చేసి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తే కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం బలోపేతం అవుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక క్వారీ సెంటర్లో సీపీఐ క్వారీ ఏరియా శాఖ మహాసభ సందర్భంగా బహిరంగసభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు శాఖ కార్యదర్శి టి. నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా అక్కినేని వనజ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దేశంలో మోడీ అవలంబిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాగ్రహం పెరుగుతుందని అన్నారు. మరోపక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో ▶మిగతా 2లో..

ఏడాది పాలన...

ఎవరికి మోదం..ఖేదం..?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీని గద్దె దించడం లక్ష్యంగా ఎంచుకున్న టీడీపీ,జనసేన, బిజెపి,కలిసి కూటమిగా ఏర్పడి విజయం సాధించి అధికారం చేపట్టింది. అంతవరకు బాగానే ఉంది.2024 సంవత్సరంలో అధికారంలోకి రావడానికి ఎవరేం చెప్పారు..? ఆ వాగ్దానాలు నెరవేర్చారా..? లేదా...? అన్నది ప్రస్తుతం ప్రధాన చర్చనీయాంశంగా సాగుతోంది. 2024లో ఎలాగైనా అధికారంలోకి రావాలని ప్రయత్నం చేసిన కూటమి విజయవంతం అయ్యింది. వైనాట్ 175 అనే నినాదంతో మళ్లీ అధికారం తనదేనని అతి నమ్మకం పెట్టుకున్న వైసీపీ చతికిల పడింది. ఈ క్రమంలో ఏడాది పాలనపై జనం ఏమనుకుంటున్నారు..? అన్న అంశం మనకు ఇప్పుడు ప్రధానం.

- ప్రజారంజక పాలనపై సర్వత్రా విమర్శలు
- ఉనికిని చాటుకోలేని వైసీపీ
- కార్యకర్తల విషయంలో దొందూ...దొందే

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: కూటమి అధికారంలోకొస్తే జగన్ పరిపాలనలో భాగమైన అమ్మఒడి, తల్లికి వందనం పేరుతో అందుతుందని మహిళలు ఎంతగానో ఆశపడ్డారు. పుట్టెడు కష్టాల్లో ఉన్న రైతు రైతు భరోసాతో ఎంతో కొంత ఊరట చెందేవాడు.ఆ స్థానంలో అర్హులైన ప్రతి రైతుకు వ్యవసాయ ఖర్చులు నిమిత్తం ఏడాదికి రూ. 20వేలు అందిస్తామని కూటమి నాయకులు బలమైన హామీని గుప్పించారు. తెలంగాణ మాదిరిగా ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం అని ఊదరగొట్టారు. ఏడాదికి మూడు సిలిండర్లు అని గట్టి హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. పరిస్థితిని పరిశీలిస్తే... ప్రజలు ఆశపడిన ప్రధాన హామీలేవి నెరవేరలేదనే విమర్శలు ప్రజలలో ఉన్నాయి. రాష్ట్ర పరిస్థితి ఎలా ఉన్నా తమకు అందుతున్న పథకాలు కుంటుపడకూడదని ప్రజల కోరిక. ఆ కోరికతోనే కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత తొలిగా పింఛన్ల పెంపు కార్యక్రమం అమలు చేశారు. దీంతో పింఛనుదారులు సంతోషంగా ఉన్నారు. కొత్త పింఛన్ల విడుదలలో కూటమి ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని తట్టుకోలేకపోతున్నారు. రేషన్ కార్డులు మార్పులు, చేర్పులు కొత్తవి మంజూరు వంటి అంశాలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో డి. కె.టి.భూములు ఫ్రీ హోల్డ్ పేరుతో రిజిస్ట్రేషన్లు చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని నిలిపివేశారు.దీనిపై ఇదిగో,అదిగో అంటూ ఏడాదికాలంగా ఎటూ తేల్చకుండా వదిలేయడంతో సర్వత్రా విమర్శలు ▶మిగతా 2లో..

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టీయూ

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్ర రాష్ట్రానికి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఉద్యోగాల నుంచి తొలగించిన 2500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణమే విధులలోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి కార్మిక సంఘ నాయకులు వినత పత్రం సమర్పించారు. రాష్ట్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా కలెక్టరు కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, ఐఎఫ్టియు, సిఐటియు నాయకులు, కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఐఎఫ్టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు కర్మగారాన్ని ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలాగా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చి, కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ కు ప్రయత్నిస్తుంటే ఏమి పట్టనట్టు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడాన్ని తీవ్రంగా విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నుండి 2500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను వారం రోజుల క్రితం తొలగిస్తే టిడిపి,జనసేన పార్టీలు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తొలగించిన ఉద్యోగులను విధులలోకి తీసుకునే విధంగా ఎటువంటి చర్యలకు పూనుకోకపోవడం ఘోరమైన చర్యగా వారు పేర్కొన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో, సుదీర్ఘ పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కారు చౌకగా ▶మిగతా 2లో..



ఖాతాదారుల సంక్షేమమే విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ లక్ష్యం

బ్యాంకు డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యంగా విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ పనిచేస్తుందని బ్యాంక్ డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ తాడేపల్లిగూడెం బ్రాంచి సభ్యుల మహాసభ డైరెక్టర్ నామన కామరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య ▶మిగతా 2లో..

సహజ వనరులు ప్రజల ఆస్తి

గ్యాస్, చమురు, ఖనిజ, ప్రకృతి వనరుల పరిరక్షణ సమితి జిల్లా నూతన కమిటీ ఎంపిక

విశాలాంధ్ర - అమలాపురం : గ్యాస్, చమురు, ఖనిజ, ప్రకృతి వనరుల పరిరక్షణ సమితి అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన కమిటీని ఏపీ రైతు సంఘం జిల్లా కోఆర్డినేటర్ కె. సత్తిబాబు సోమవారం ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా ఉండవల్లి గోపాలరావు, కో కన్వీనర్‌గా గండి ఏసు దాసు, జిల్లా కమిటీ సభ్యుడు జాలెం సుబ్బారావు, రాపాక రత్న రాజు, ఒంటెద్దు వెంకన్న నాయుడు, అయితా బత్తుల ఉమా మహేశ్వర రావు, బండారు రామ్మోహనరావు, దేవ రాజేంద్రప్రసాద్, పులపర్తి సురేష్ ఎన్నికయ్యారు.

కమిటీ తీర్మానాలు : సహజ ▶మిగతా 2లో..

ఇళ్ల స్థలాలకై 2న ధర్నా

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ సూపర్ సిక్స్ హామీలు అమలు కోరుతూ సీపీఐ రాష్ట్ర వ్యాపిత పిలుపుమేరకు జూన్ 2 న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు విజయవంతం చేయాలని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సోమవారం భీమవరం సిపిఐ జిల్లా కార్యాలయంలో ధర్నా గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్ళు లేని నిరుపేదలతో ఇండ్ల స్థలాలకోసం కలెక్టరేట్‌లోనూ, ▶మిగతా 2లో..

ప్రజల ఆస్తి (1వ పేజీ తరువాయి)

వనరులు ప్రజల ఆస్తి అని, యాజమాన్య హక్కు ప్రజలకు ఉండాలని 12వ ఆర్థిక సంఘం చెప్పినట్టు 50 శాతం వాటా సంబంధిత రాష్ట్రాలకు ఇవ్వాలని, భూములు కోల్పోయిన రైతులకు, పైపులైన్లు ఏర్పాటు చేసిన భూ యజమానులకు నష్టపరిహారం అందించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, తదితర అంశాలను తీర్మానించారు. నూతన కమిటీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని సత్తిబాబు తెలిపారు.

2న ధర్నా (1వ పేజీ తరువాయి)

సచివాలయాల్లో దరఖాస్తులు పేదలు వ్యక్తిగత అర్జీలు సమర్పించారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలతో పాటు, ఇంటి నిర్మాణ వ్యయం పెరిగిన కారణంగా రూ.5 ఐదు లక్షలు ఇవ్వాలని గత ఎనిమిది నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి జి.ఓ.నెం.23 విడుదల చేసి చేతులు దులుపుకుందని కోనాల విమర్శించారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందారని ఆయన విమర్శించారు. జూన్ 2వ తేదీన ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులతో నిర్వహించే ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున అర్జీదారులు పాల్గొని జయప్రదం చేయాలని కోనాల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, నాగిడి శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లక్ష్యం (1వ పేజీ తరువాయి)

అతిథిగా పాల్గొన్న జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఖాతాదారుల,సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా బ్యాంకు పని చేస్తుందన్నారు. పట్టణ ప్రాంతంలో ఉన్న చిరు వ్యాపారులు, సామాన్యులకు రుణాలు అందించేందుకు బ్యాంకు కృషి చేస్తుందన్నారు. నూరు శాతం సహకారస్ఫూర్తితో నడుస్తున్న బ్యాంకుగా విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకుకు ఎంతో చరిత్ర ఉందన్నారు. 1983లో మానం ఆంజనేయులు చైర్మన్‌గా బ్యాంకు విస్తరణ ప్రారంభమైందన్నారు. గత 40 సంవత్సరాలుగా బ్యాంకు సభ్యులకు డివిడెండు చెల్లిస్తోందన్నారు. అత్యధికంగా 42 శాతం చెల్లించామన్నారు. రుణం తీర్చేసినా షేర్ హోల్డర్‌గా కొనసాగే పరిస్థితి బ్యాంకులో ఉందన్నారు. సభ్యుల వద్దకే వచ్చి సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు.ఇతర సహకార బ్యాంకులకు దీటుగా సభ్యులకు మెడికల్ పాలసీలు,విద్యా రుణాలు,ప్రమాద బీమా అందిస్తున్నామన్నారు.ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల నుండి అధిక వడ్డీలకు రుణాలు పొందే చిన్న వ్యాపారులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామన్నారు. రానున్న ఐదు సంవత్సరాలలో రూ.100 కోట్లు రుణాలు అందించాలన్నదే పాలకవర్గ లక్ష్యం అన్నారు. బ్యాంక్ డైరెక్టర్ డాక్టర్ చెలికాని కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ సహకార బ్యాంకులో సభ్యులే యజమానులు అన్నారు.సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారం మాట్లాడుతూ బ్యాంక్ అందిస్తున్న సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు డిప్యూటీ సీఈవో ఎంపీ గణేష్, జోనల్ మేనేజర్ టి ఆర్ ఠాగూర్,బ్రాంచ్ మేనేజర్ కే ఎం ఎస్ ఎస్ నారాయణ,లీగల్ అడ్వైజర్ జి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో : దేశ పురోభివృద్ధిలో సహకార బ్యాంకుల పాత్ర కీలకం అని విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఏలూరులో బ్యాంకు జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సహకార బ్యాంకులపై ఆర్బీఐ నిబంధనల పేరుతో ఆంక్షలు విధించడం సరైన విధానం కాదన్నారు. ఇలాంటి విధానాలతో సహకార బ్యాంకులు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సహకార బ్యాంకులను జాతీయ బ్యాంకులతో సమానంగా చూడాలని కోరారు. సహకార బ్యాంకుల అభివృద్ధికి ఖాతాదారులు మరింత సహకారం అందించాలని కోరారు. విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఏలూరు బ్రాంచి మేనేజర్ కొండబాబు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, బ్యాంకు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనసాగించాలి (1వ పేజీ తరువాయి)

విక్రయించడానికి చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే విడనాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. సోమయ్య,ఐ ఎఫ్ టి యు ఏలూరు నగర కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు,ఐఎఫ్టియు ఏలూరు నగర నాయకులు పల్లి గంగరాజు మీసాల రమణ సిఐటియు నాయకులు అంగులూరి జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలన (1వ పేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. మహిళల ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం వాయిదా పడుతుండడంతో చర్చనీయాంశంగా మారింది.రైతన్నకు ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవ కూటమి ప్రభుత్వంలో కరువవడంతో రైతాంగం తీవ్ర అసంతృప్తితో ఉంది. ఏడాదికి మూడు సిలిండర్లు సంపూర్ణంగా అమలు కావడం లేదనే విషయం లబ్ధిదారుల ద్వారానే తెలుస్తుంది. ఇవన్నీ పరిశీలిస్తే కూటమి ప్రభుత్వంలో ఏడాది పాలన ప్రజారంజకంగా కనిపించడం లేదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

ఉనికి చాటుకోలేకపోతున్న వైసీపీ

రాష్ట్ర రాజకీయ చరిత్రలో గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా సాధించలేని విజయాన్ని సంపాదించిన వైసీపీ 2019 నుంచి 24 వరకు పాలించింది. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి తన చుట్టూ కావలసినంత మంది సలహాదారులను ఏర్పాటు చేసుకొని బాగా నోరు కలిగిన మంత్రులకు పూర్తి వాక్ స్వాతంత్రాన్ని ఇచ్చారు. దీంతో అప్పటి ప్రతిపక్షమైన టీడీపీని శాసనసభలో నోరు గలిగిన మంత్రులు ఉతికి పారేశారు. దీంతో తన చుట్టూ ఉన్న మంది మార్బలం సైన్యంతో జగన్ రెచ్చిపోయి తన వెంట్రుక పీకలేరని, 175కు 175 సీట్లు ఎందుకు వైసీపీ సాధించలేదని సవాలు విసురుతూ ప్రజలలోకి వెళ్లారు. ముఖ్యమంత్రి పాలనలో మంత్రుల వీరంగం చూసిన ప్రజలు 2024లో విర్రవీగిన వారికి తగిన గుణపాఠం చెప్పారు. ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకొని ప్రజలకు అందదండలు అందించాల్సిన వైసీపీ తనకు ప్రతిపక్ష హోదా రాలేదని అధికారపక్షంపై అలకబూని చాలా వరకు ప్రజలకు దూరంగా ఉంటోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అధికార పక్షాన్ని పాలన విషయంలో ఎక్కడికక్కడ నిలదీయాల్సింది పోయి ఆ పార్టీ నాయకులు ఎవరికి వారు నిస్తేజంగా ఉన్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాల్సిన విషయంలో ప్రజలకు ప్రతిపక్షాలు చేదోడు వాదోడుగా నిలబడి వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత ఉంది. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి అధికారం లోకి వచ్చి ఏడాది గడిచినా కార్యకర్తలకు ఏమీ చేయలేకపోతోంది.ప్రజల మనోభావాల ప్రకారం కార్యక్రమాలు రచించుకొని అమలు చేయాల్సిన వైసిపి నాయకులు తమ ఉనికిని చాటుకోలేకపోతు న్నారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

కార్యకర్తల విషయంలో దొందూ...దొందే..

గత వైసీపీ ప్రభుత్వంలో అధికారం చలాయించిన జగన్ ఎమ్మెల్యేలకే సరైన అపాయింట్మెంట్ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందనే విమర్శలు మూట కట్టుకున్నారు. ఈ పరిస్థితులలో సామాన్య కార్యకర్తలను పట్టించుకున్న పాపాన పోలేదని వైసీపీ వర్గాలు విమర్శిస్తున్నాయి.తీరా అధికారం చేజారిన తర్వాత జగన్ పూర్తిగా కార్యకర్తల జపం చేస్తున్నారు.ఇలాంటి పరిస్థితులలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో కూడా ఇప్పటివరకు అటు టిడిపి,ఇటు జనసేనలో కార్యకర్తల పరిస్థితి అంత బాగాలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో చంద్రబాబు కార్యకర్తలను దేవుళ్ళుగా చిత్రీకరిస్తూ జపం చేస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పాలకులు కేంద్రంతో సత్సంబంధాలు ఏర్పరచుకొని నిధులు రాబట్టడంలో విజయవంతం అయ్యారు.అంతే తప్ప కార్యకర్తల విషయంలో అటు వైసిపి, ఇటు టిడిపి దొందూ.. దొందేనని పలువురు విమర్శిస్తున్నారు.ఇక ప్రజలు మాత్రం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపైనే దృష్టి సారించారు.

ఉద్యమించండి (1వ పేజీ తరువాయి)

అసంతృప్తి ఉందని ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తే ప్రత్యామ్నాయ పార్టీగా ప్రజలు గుర్తిస్తారని ఆమె అన్నారు. దేశంలో పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాల కోసం కమ్యూనిస్టు పార్టీ అలుపెరగని ఉద్యమాలు నిర్వహించింద న్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి శాఖ గుండెకాయ లాంటిదని ఆమె తెలిపారు. మహాసభల సందర్భంగా ఇంటింట సీపీఐ పేరుతో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

అక్రమ ఇసుక రవాణాతో ఎమ్మెల్యేలకు ప్రతి రోజు 10 లక్షలు రాబడి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ పేరుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేస్తున్నామని చెప్తున్నారు గానీ అదంతా బోగస్ అని రాత్రి వేళల్లో అడ్డు అదుపు లేకుండా అక్రమ ఇసుక రవాణా వ్యాపారం సాగుతున్నదని, గోదావరికి ఆనుకుని ఉన్న ప్రతి ఎమ్మెల్యేకు రోజుకు 10 లక్షల అక్రమ రాబడి వస్తుందని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటలకు మాత్రమే ఇసుక రవాణా చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చాలా ఇసుక ర్యాంపులలో ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ ఇష్టానుసారం కూటమి ఎమ్మెల్యే అనుచరులు అక్రమ ఇసుక రవాణా చేస్తున్నా మైనింగ్ శాఖ చోద్యం చూస్తుందని మధు విమర్శించారు. ప్రతి రోజుకు 10 లక్షల రూపాయలు అక్రమంగా ఎమ్మెల్యేలకు అందుతుందని పేర్కొన్నారు. చాలాచోట్ల బాటసారి చార్జి అదనంగా లారీకి రూ.1000 వసూలు చేస్తున్నారని తెలిపారు. వంగలపూడి, మురకలంక, పెరవలి, పెండ్యాల, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు, కడియం, రాజమండ్రి ఈ ప్రాంతాలలో ఇసుకను దోచేస్తున్నారని ఆయన తెలిపారు. త్వరలో దీనిపై అఖిలపక్ష పార్టీలతో ర్యాంపులలో పర్యటించి నిగ్గు తేలుస్తామని తుది నివేదికను జిల్లా కలెక్టర్కు అందజేస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. రాంబాబు జిల్లా కార్యవర్గ సభ్యులు పి. లావణ్య, కె. శ్రీనివాస్, పి. త్రిమూర్తులు, సీపీఐ స్థానిక నేతలు అర్జనమ్మ, శంకురమ్మ, అప్పయ్యమ్మ, సుజానమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ శాఖ హెచ్చరికలతో విద్యుత్ సిబ్బంది అప్రమత్తం

విశాలాంధ్ర-ఏలూరు: వాతావరణ కేంద్రం ఏలూరు జిల్లాలో భారీ వర్షాల హెచ్చరికతో జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. విద్యుత్ఘాతంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎటువంటి అంతరాయాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు పి. సాల్మన్ రాజును ఆదేశించారు. జిల్లాలోని మండల స్థాయి అధికారుల ఫోన్ నెంబర్లు అందరికీ అందుబాటులో ఉంచాలని,అత్యవసర పరిస్థితుల్లో వారిని సంప్రతించేలా విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లను గ్రామాలలోని ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.అత్యవసర సమయంలో ఎవరైనా ఫోన్ చేసినప్పుడు స్పందించకపోయినా సకాలంలో సమస్యలు పరిష్కరించ పోయినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు చేపడతామని ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి విద్యుత్ శాఖాధికారులను హెచ్చరించారు.

విద్యార్థులకు పోటీలు

విశాలాంధ్ర-లింగపాలెం: వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రంథాలయాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.జనరల్ నాలెడ్జి,పాఠ్యాంశాలకు సంబంధించి క్విజ్ పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారులు లతీఫ్, వెంకటరమణ వీటిని నిర్వహించారు.

చారిత్రాత్మక నిర్ణయాలకు వేదిక కానున్న మహానాడు

టీడీపీ ఎస్.సి. సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ

విశాలాంధ్ర-ఏలూరు: రాయలసీమ జిల్లాల నడిబొడ్డున కడప వేదికగా తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు చారిత్రాత్మక నిర్ణయాలకు వేదిక కానున్నదని తెదేపా ఎస్.సి. సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, టిడిపి మూడవ డివిజన్ ఇన్‌చార్జి జాలా బాలాజీ పేర్కొన్నారు. కడపలో మూడు రోజులపాటు జరగనున్న మహానాడుకు సోమవారం మూడో డివిజన్ నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జాలా బాలాజీ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహానాడు కార్యక్రమంలో కార్యకర్తలకు పెద్దపీట వేయడంతో పాటు పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేవులగడ్డ లాలా లజపతిరాయ్, పెదపూడి లావరాజు, పలమర శెట్టి గోపాలకృష్ణ, చిన్న అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై పశువుల దాణా

విశాలాంధ్ర-టి నరసాపురం: ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశువుల దాణా అందిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి కె .కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పశు వైద్యశాల వద్ద సోమవారం విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాడి రైతులకు 12 టన్నుల పశువుల దాణా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులకు 50 కేజీల దాణా 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. 50కేజీల పశువుల దాణా సంచి రూ.1110 ఉండగా రాయితీ పై రూ. 555 లకే ప్రభుత్వం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో, పశు వైద్యశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు. పాడి రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఖరీఫ్ పంటకు సబ్సిడీ విత్తనాలను నిర్ణీత సమయంలో సరఫరా చేయాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి రైతులు, కౌలు రైతులకు విత్తనాలను 75 శాతం సబ్సిడీపై సకాలంలో సరఫరా చేయాలని కలెక్టర్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరఫున సోమవారం కలెక్టర్ వెట్రిసెల్వికి రైతు సంఘం నాయకులు మెమోరాండం సమర్పించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఖరీఫ్ పంటకు విత్తనాలు కొరత లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన కోకో, వరితో పాటు, తదితర వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు అందేలాగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వరి, వేరుశనగ, మినుము, పెసర, పత్తి, మిర్చి, కందులు తదితర పంటల విత్తనాలు సకాలంలో 75 శాతం సబ్సిడీతో అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కోకో రైతులకు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే కోకో పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించి కోకో గింజలను రైతులు నుండి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, చలసాని జగన్మోహనరావు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి

జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: మీకోసం అర్జీలకు నిర్ణీత సమయంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేటు పిజిఆర్ యస్ సమావేశ మందిరంలో మీకోసం

కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల ప్రజల నుండి అర్జీలను జాయింటు కలెక్టరు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలు పరిశీలించి నిర్ణీత గడువులోగా అర్థవం తంగా పరిష్కరించే దుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్ర మంలో జిల్లా రెవిన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కె.సి.హెచ్. అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంక టేశ్వర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర -భీమవరం: ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి లైన్ల పై చెట్లు, కొమ్మలు, తొలగించుట పనులు జరుగుతున్నందున మంగళవారం ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు చినరంగనిపాలెం, ప్రకృతి ఆశ్రమం, కలెక్టరేట్ ఏరియా, ఎఫ్.సి.ఐ. గోడౌన్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించా లని ఆయన విజ్ఞప్తి చేశారు.

అధికారులు సమీక్షలు చేస్తున్నా స్పందన కరువు

మరమ్మత్తులకు నోచుకోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు

విశాలాంధ్ర-లింగపాలెం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మత్తులకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో స్పందన కరువవుతున్నది. వసతి గృహాలు తెరిచేందుకు సమయం దగ్గర పడుతున్నా వీటి మరమ్మత్తు పనులు పూర్తి కాలేదు. లింగపాలెం మండలంలో ఉన్న ధర్మాజీగూడెం బాలుర, బాలికల, లింగపాలెంలోని బాలుర వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.57లక్షలు మంజూరు చేసింది. మార్చి నెల చివరికి మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ పనులు ప్రారంభించి నిలిపివేశారు. ధర్మాజీగూడెంలోని రెండు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాల్సి ఉంది. 30 ఏళ్ల క్రితం వీటిని నిర్మించారు. ఒకొక వసతి గృహంలో 150 మంది విద్యార్థులు ఉంటున్నారు. మండలంలోని ఉన్న మూడు వసతి గృహాలకు విద్యార్థుల డిమాండ్ అధికంగా ఉంది. విద్యార్థులకు తగ్గట్టుగా వసతి గృహాలలో సౌకర్యాలు లేవు. సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు, వసతి గృహాలలోపనిచేసే సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పటినుంచో కోరుతూనే ఉన్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం స్పందించి వసతిగృహాల మరమ్మతుకు అదనపు సౌకర్యాల కోసం నిధులు మంజూరు చేసింది. వీటి మరమ్మత్తులు సకాలంలో జరుగుతాయని ఆశించిన వారందరు నిరుత్సాహం చెందుతున్నారు. మరమ్మత్తు పనులు జరగటం లేదు. ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో కదలికలు లేవు. దీనిపై అందరికి నిరాశ కలుగుతుంది. డిమాండ్ ఉన్న ఈ వసతి గృహాలలో సౌకర్యాలు కల్పిస్తే అదనంగా విద్యార్థులను చేర్చుకునేందుకు అవకాశం ఉంది. విద్యా సంవత్సరం తిరిగి ప్రారంభమవుతున్నా మరమ్మత్తు పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. అదనంగా విద్యార్థులను చేర్చుకోవడం అలా ఉంచితే ఉన్న విద్యార్థులకే వసతులు లేని పరిస్థితి నెలకొంది. ధర్మాజీగూడెంలో బాలికల వసతి గృహానికి ఉన్న ప్రహరీ గోడ శిథిలమవటంతో దీన్ని పడగొట్టారు. పునర్నిర్మాణ పనులు జరగటం లేదు. ఇదిగో, అదిగో అంటున్నారే గాని పనులు ప్రారంభించకపోవడం పట్ల ప్రతి ఒక్కరిలో నిరాశ వ్యక్తం అవుతోంది. బాలికల వసతి గృహానికి తప్పనిసరిగా ప్రహరీ ఉండాలి. వసతి గృహాలు తిరిగి ప్రారంభించే నాటికన్నా కనీసం ప్రహరీనైనా పూర్తి చేయాలని కోరుతున్నారు. అరకొరగా పనులు ప్రారంభించి నిలిపివేయటంపై సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి. ప్రభుత్వం వీటి మరమ్మతుల కోసం లక్షల రూపాయలు మంజూరు చేసింది. పనులు ఎందుకు చేయటం లేదు? అర్థం కాని పరిస్థితి నెలకొంది. అజమాయిషి చేసేవారే కరువయ్యారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మత్తు పనులను పూర్తి చేయించాలని విద్యార్థులు వీరి తల్లిదండ్రులు కోరుతున్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

◆చారిత్రక ప్రదేశాల్లో యోగా శిబిరాలు

◆జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర-ఏలూరు: యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం నుంచి మండలాల్లో యోగా భ్యాస కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. జిల్లాలోని 4 చారిత్రక ప్రదేశాల్లో యోగా శిబిరాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలన్నారు. మే 29వ తేదీన ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రంలో హరిత హోటల్ వద్ద, జూన్ 5వ తేదీన పోలవరం మండలం పట్టిసీమ రివర్ ఇన్‌రిసార్ట్ వద్ద, జూన్ 11వ తేదీన జంగారెడ్డిగూడెం గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద, జూన్ 18వ తేదీన కామవరపుకోట మండలం జీలకర్రగూడెం, గుంటుపల్లి బౌద్ధరామాల వద్ద, యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి కేంద్రానికి యోగాభ్యాస కులు హాజరయ్యేలా ఆయా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. ఈనెల 27వ తేదీ మంగళవారం ఉదయం గం. 8లకు ఏలూరు ఇండోర్ స్టేడియం నుండి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు, తిరిగి కొత్త బస్టాండ్ వరకు వెయ్యి మందితో సామూహిక యోగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బం దీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్డిఏ పిడి ఆర్. విజయ రాజు, జెడ్పి సిఇఓ కె. భీమేశ్వరరావు, నగరపాలక సంస్థ కమీషనరు ఎ. భానుప్రతాప్, ఆయుష్ ఆర్ డిడి లక్ష్మీసుభద్ర, డిఇఓ కె. వెంకటలక్ష్మమ్మ, పర్యాటక శాఖ మేనేజరు పట్టాభి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర -భీమవరం: నిత్యం యోగ అభ్యసనం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చుని జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవ కార్యక్ర మంలో భాగంగా సోమవారం జిల్లా ఆయుష్ శాఖ, జిల్లా విద్యాశాఖ సంయుక్త

ఆధ్వర్యంలో భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ ఆడిటోరియంలో యోగా అభ్యాసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆ మహాభాగ్యాన్ని యోగా ద్వారా సాధ్యం చేసుకోవచ్చని అన్నారు. యోగాతో మానసిక ఒత్తిడి తగ్గించుకుని ప్రశాంతమైన జీవితం సాగించవచ్చున్నారు. మే 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు జరిగే "యోగాంధ్ర - 2025" కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పించి యోగాంధ్ర వెబ్ సైట్ లో తమ పేర్లు నమోదు చేసుకునే విధంగా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు బి.చంద్రశేఖర్ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయడం వల్ల ఏ విధంగా ఆరోగ్యంగా జీవించవచ్చో వివరిస్తూ హాజరైన అభ్యాసకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ హరి శ్రీనివాస్, జిల్లా టూరిజం అధికారి ఎ.అప్పారావు, తహసిల్దార్లు, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, ఆయుష్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్స్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

29న సీపీఐ మండల మహాసభ

విశాలాంధ్ర-కుక్కునూరు: పోరాటాల చరిత్ర గలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ కుక్కునూరు మండల 16వ మహాసభ ఈ నెల 29 గురువారం కుక్కునూరులో జరుగుతుందని సిపిఐ మండల కార్యదర్శి ఎం. వెంకటాచారి తెలిపారు. సోమవారం సిపిఐ మండల కమిటీ సమావేశం మండల సహాయ కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య అధ్యక్షతన కుక్కునూరులో

జరిగింది. ఈ సందర్భంగా ఎం. వెంకటాచారి మాట్లాడుతూ తెలంగాణ నుండి ఆంధ్రాలో విలీనమైన కుక్కునూరు మండల సిపిఐకి పోరాటాల చరిత్ర ఉందని తెలిపారు. మండలంలో పోడు భూముల సమస్య తీవ్రంగా ఉందని, పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి హక్కుపత్రాలు ఇవ్వాలని సిపిఐ అనేక పోరాటాలు చేస్తుందని ఆయన వివరించారు. పోలవరం ప్రాజెక్టును 45. 72 మీటర్ల ఎత్తులో నిర్మించాలని, ప్రాజెక్ట్ నిర్మాణ సందర్భంగా నిర్వాసితులైన వారందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కచ్చితంగా అమలు చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు. సిపిఐ 16వ మండల మహాసభ ఈనెల 29 గురువారం ఉదయం గం.10లకు కుక్కు నూరులో చర్చి కాంపౌండ్ దగ్గర జరుగుతుందని ఆయన తెలి పారు. మహాసభకు సిపిఐ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు హాజరవు తున్నారని చెప్పారు. సమావేశంలో కొన్నే లక్ష్మయ్య, వరక శ్యామల, కూరాకుల బాబురావు మహాసభ ఏర్పాటుపై సమీక్షించారు.

భూమి సర్వే చేయడానికి డబ్బు తీసుకున్నాడని వీఆర్వో పై ఫిర్యాదు

విశాలాంధ్ర-ముదినేపల్లి : తమ భూమిని సర్వే చేయమని వీఆర్వోను కోరితే డబ్బులు ఇవ్వాలని తీసుకున్నాడని స్థాని కులు ముదినేపల్లి తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి ముదినేపల్లి

మండలం వైవాక లో సర్వే నెం 601/3 తాలూకు భూమి సర్వే చేయమనగా స్థానిక రెవెన్యూ అధికారి రూ.14000 తీసుకుని సర్వే చేసినట్లు , సర్వే సరిలేదని చెప్పి మరోసారి రూ.12 వేలు తీసుకుని సర్వే చేశారు. చదువు లేనందువల్ల తనను మోసగించి మొత్తం రూ 26,000 అన్యాయంగా తీసుకున్న అధికారిపై చర్యలు చేపట్టాలని తనకు న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.

వైవాక కాల్వగట్టు హాంఫట్

చెరువు తవ్వకంతో పాటు బోర్ ఏర్పాటు

విశాలాంధ్ర-ముదినేపల్లి : ఒక రైతు ప్రభుత్వ భూమిని ఆక్రమించి రొయ్యల చెరువు తవ్వి సాగుకు చెరువుగట్టుపై బోర్ వెల్ ఏర్పాటు చేసుకున్నా స్థానిక రెవిన్యూ సిబ్బంది ప్రేక్షక పాత్ర వహించి చోద్యం చూస్తున్నారు. ముదినేపల్లి మండలం వైవాక గ్రామంలో రెవెన్యూ సిబ్బంది

ఉందా లేదా అని ప్రశ్న స్థానికుల్లో తలెత్తుతోంది. గ్రామానికి చెందిన ఓ రైతు స్థానిక యంత్రాంగంతో మిలాఖత్ అయ్యి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారనడానికి ఈ దృశ్యం సాధ్యంగా కనిపిస్తోంది. సర్వేనెం 601/3 లో 1.07 ఎకరాలు , సర్వే నెం 600 లో 0.93 సెంట్లు, సర్వే నెం 601/ 2లో 0.42 సెంట్లు, కాల్వభూమిని 2.40 సెంట్లు బోరువెల్ వేసుకుని ఇతర రైతులకు నీరు వెళ్లకుండా చేస్తున్నాడు. దళిత రైతులు ఆక్రమణదారుని ప్రశ్నిస్తుండగా దౌర్జన్యానికి పాల్పడు తున్నాడని స్థానిక రైతులు వాపోతున్నారు. ఈ ఆక్రమణలను తొలగించి , బోర్ వెల్ ను తొలగించి అతనిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు రైతులు పేర్కొంటున్నారు.

ఆలపాటి సురేష్‌కు మంత్రి పార్థసారథి అభినందనలు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా నియమితులైన ఆలపాటి సురేష్ ను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఒక ప్రకటనలో తెలిపారు. ఆలపాటి సురేష్ నాయక త్వంలో జర్నలిస్టులకు ఎంతగానో

మేలు జరుగుతుందన్నారు. సుదీర్ఘకాలంగా ఆయన జర్నలిజంలో కొనసాగుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రభుత్వం ద్వారా పరిష్కారం అయ్యేలా చేశారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

మట్టి నమూనాల సేకరణ పూర్తి

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండల వ్యాప్తంగా మట్టి నమూనాల సేకరణ పూర్తి చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి వి. నారా యణరావు ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఆయన మాట్లాడుతూ రెండున్నర హెక్టార్లకు ఒక నమూనా చొప్పున మండల వ్యాప్తంగా మొత్తం 1143 నమూనాలు సేకరించి తాడేపల్లి గూడెంలోని మట్టిని పరిశీలించే ప్రయోగశాలకు తరలించినట్లు

తెలిపారు. ప్రయోగశాలలో వచ్చిన ఫలితాల ద్వారా భూమిలోని పోషకాల విలువలను బట్టి రైతు సోదరులు ఎంతెంత మోతాదులో ఎరువులు వెయ్యాలో తెలియ జేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ఖరీఫ్ సీజన్‌కు ప్రారంభానికి ముందే రైతు సోదరులకు ప్రయోగశాల నుండి వచ్చిన రిపోర్టును అందజేసి ఎరువుల మోతాదును తమ సిబ్బంది ద్వారా తెలియజేయటం జరుగుతుందన్నారు.

లింగపాలెం మండల టీడీపీ అధ్యక్షులుగా చలపతి

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా గరిమెళ్ళ చలపతి రెండోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈయన ఎంపికను ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆమోదించారు. గతంలో ఈయన పార్టీ అధ్యక్షులుగా పని చేస్తూ ఉన్నారు. రెండోసారి పార్టీ

అధ్యక్షుడుగా ఎన్నుకోవడం పట్ల ఈ పార్టీకి చెందిన నాయకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. తనకు అప్పగించిన పార్టీ అధ్యక్ష పదవిని సక్రమంగా నిర్వహిస్తానని పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చలపతి అన్నారు. పార్టీలో అందర్నీ కలుపుకొని ముందుకెళ్తానని తెలిపారు.

సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా త్వరలో అమలు చేసే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయటానికి వారి ఖాతాలను ఎన్ పి సిఐ విధానం కింద ఆధార్ తో అనుసంధానం చేసుకోవాలని ఏలూరు డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ ఎస్. శ్రీకర్ బాబు సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది చేకూరటానికి వారి బ్యాంక్ ఖాతాలు ఆధార్ తో లింకు అయ్యి వుండాలన్నారు. దీని నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంబంధిత ప్రాజెక్ట్ డైరెక్టర్, జీఎస్ డబ్ల్యూఎస్ (సచివాలయ సిబ్బంది) వారికి తగు సూచనలు ఇచ్చినట్టు తెలిపారు. వారి సూచనలకు అనుగుణంగా ప్రజలందరూ తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవలసిందిగా తపాలా శాఖ నుండి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ప్రస్తుతానికి ఏలూరు జిల్లాలో సుమారుగా 7000 మందికి బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ లేకుండా వున్నాయన్నారు. బ్యాంక్ ఖాతాలు లేని వారు కేవలం రూ. 200(రెండు వందల)లతో తపాలా శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతా ఓపెన్ చేసుకొని ఆ ఖాతాకు ఆధార్ ను అనుసంధానం చేసుకొనే ప్రక్రియ ప్రతీ పోస్ట్ ఆఫీసులో ఉందన్నారు. మరిన్ని వివరాల కొరకు కె.రాజేష్, సీనియర్ బ్రాంచి మేనేజరు, ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంకు ఏలూరు(ఫోన్ నెం: 7893436211) వారిని సంప్రదించవచ్చన్నారు.

అయ్యా... మాకు న్యాయం చేయండి

దళితుల ఆవేదన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఎస్.సి.కులానికి చెందిన వారి ఇళ్ళు ప్రభుత్వ అధికారులు తొలగించాలను కోవడం న్యాయం కాదని సీతంపేట ఎస్.సి.కాలనీకి చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సీతంపేట గ్రామంలో సర్వే నెంబర్ 205లో దశాబ్దాల కాలం నుంచి నివాసం ఉంటున్న దళితులకు చెందిన 20 ఇళ్లు ఖాళీ చేయాలని , ప్రభుత్వ పుంత పోరంబోకు భూమిలో ఇళ్లు నిర్మించుకున్నా రని, ఖాళీ చేయాలని సోమవారం రెవెన్యూ అధికారులు గ్రామంలో జెసిబి సహాయంతో పూరి గుడిసెలు తొలగించడానికి ప్రయత్నం చేయగా,ఎస్.సి.కాలనీకి చెందిన దళితులంతా కలిసి ఆందోళన చేశారు. కనీసం గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) ఏ విధమైన నోటీసులు కూడా ఇవ్వకుండా జెసిబి తీసుకువచ్చి తమ ఇళ్ళు పడగొట్టడానికి ప్రయత్నాలు చేశారని,దళిత వర్గాల వారిపై అధికారులు చిన్న చూపు చూస్తూ తమ గూడును తీసేస్తున్నారని, ఉన్నఫళంగా పిల్లలతో ఉన్న తాము ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతంపేట గ్రామం ఎస్.సి.

కాలనీకి చెందిన దళితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఒక రైతు ఎస్.సి. కాలనీ ని ఆనుకుని వున్న పొగాకు బేరన్లను ఇటీవల కాలంలో కొనుగోలు చేసి, తాను పండించిన పొగాకు పంట బేరన్ దగ్గరకు తీసుకువచ్చి ఉడికిస్తారని, తన బేరన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ పుంత పోరంబోకు స్థలంలో ఇల్లు లేక దళిత వర్గానికి చెందిన ఒకరు ఉండటానికి రేకుల షెడ్డు వేసుకోవడంతో , బేరన్ గల రైతు తరచూ తమను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. సంబంధిత రెవెన్యూ అధికారులు దళితులకు న్యాయం చేయాలని తెలిపారు.

హీల్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర -ఆగిరిపల్లి: పుట్టుకతో ,ప్రమాదంలో అంగవైకల్యం పొందిన దివ్యాంగులకు హీల్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర అకాడమిక్ అడిషనల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తోటపల్లిలో సోమవారం హీల్ సంస్థలో దివ్యాంగులకు ఆయన కృత్రిమ కాళ్ళను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాధలైన చిన్నారులకు ఉచిత విద్య, వసతి కల్పించడంతో పాటు అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపి, కంప్యూటర్ విద్య అందించడం ద్వారా వారిని సమాజంలో స్వయం శక్తిగా

ఎదగడానికి కృషి చేస్తున్న హీల్ సంస్థ చేస్తున్న సేవలు అందరికీ ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్,సీనియర్ టెక్నీషియన్ చిన్నా పలువురు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: పశ్చిమగోదావరి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో 11 అర్జీలు వచ్చాయని వాటిని పరిశీలన చేసి సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ

అద్నాన్ నయీం అస్మి ,పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమారావు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర - నరసాపురం: నరసాపురం పట్టణ పరిధిలో పనిచేస్తున్న వార్డు సచివాలయ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించా లంటూ మున్సిపల్

కమిషనర్ ఎం.అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీవెంకట రమణకు సోమవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సచివాలయం సంఘం నాయకులు మాట్లాడుతూ సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్నారన్నారు. రేషనలైజేషన్‌లో కొరత ఉన్న సిబ్బందిని భర్తీ చేయాలన్నారు. సచివాలయాలలో త్రాగునీరు,మరుగుదొడ్లు, కంప్యూటర్లు ఇంటర్నెట్ లాంటి మౌలిక సదుపాయాలు కొరతను తీర్చాలన్నారు. ఇంటింటి సర్వేల పై ప్రజలకు అవగాహన నిమిత్తం మైక్ అనౌన్స్మెంట్ లాంటివి చేయించాలన్నారు. ఇతర సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళ్లారు.కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు జి జోసెఫ్ కిషోర్,నరసాపురం మండల అధ్యక్షులు పి. మదన్మోహన్,సంఘ నాయకులు ఈ ఉదయ్ కుమార్,అడపా సత్యనారాయణ,డి.కృష్ణ , జి. గోపాల కృష్ణ, ఎస్. అశోక్ రాయుడు,ఎన్ దివ్య,ఎల్ జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : యోగా చేయడం వలన శారీరక ఆరోగ్యం మెరుగుగా ఉంటుందని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, యోగ మిత్ర మండలి అధ్యక్షులు బలుసు నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకురాలు యు. రాముడు

ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం 24వ రోజుకు చేరుకోవడంతో సోమవారం విద్యార్థులకు నాగేశ్వరరావు, యోగాసనాలు వేయించి యోగా వలన మనిషి శరీరానికి కలిగే ఉపయోగాల గురించి సూచించారు. రాముడు సైంటిస్టుల జీవిత చరిత్ర పుస్తకాలను, కథల పుస్తకాలను, చదివించారు. ఈ కార్యక్రమంలో సిరాజ్, గ్రంథాలయ సిబ్బంది సత్యనారాయణ, చదువరులు , పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - నరసాపురం: నరసాపురం బి జి బి ఎస్ మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ కళాశాలలో తాత్కాలిక కామర్స్ లెక్చరర్ గా పనిచేస్తున్న వీరవల్లి గంగా లక్ష్మి

ఆరోపించారు. సోమవారం నరసాపురంలో తోటి మహిళా ఉద్యోగులతో కలిసి బాధితురాలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగురాలినైన తనను విడిచి పెట్టేయాలని చెప్పినా శ్రీనివాస్ కనికరించకుండా లాడ్జికి, సినిమాలకు, సెలవు రోజుల్లో కాలేజీకి రమ్మని ఒత్తిడి చేస్తున్నాడంటూ బాధితురాలు ఆరోపించారు. అతని కోరిక తీర్చలేదని కోపంతో రెండుసార్లు ఉద్యోగం నుంచి తనను తొలగించాడని,చివరికి తోటి ఉద్యోగులు విద్యార్థులు ఆందోళన చేయటంతో తిరిగి విధులలోకి చేర్చుకున్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కళాశాలలోని కొంతమంది విద్యార్థులను కూడా కరస్పాండెంట్ ఇదే తరహాలో వేధింపులకు పాల్పడుతున్నాడన్నారు. విచారణ జరిపి అతనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మధు షాలిని, రజనీ, ఝాన్సీ లక్ష్మీ బాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన కాకినాడ పట్టణ, గొగ్గెలపాడుకు చెందిన బాధితురాలు సలగాల లక్ష్మీకాంతమణి (80) తన ఆరోగ్య సమస్యల నేపథ్యంలో పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో వాహనంలోనే ఉండిపోయారు. ఆమె వాహనంలో ఉన్న విషయాన్ని గమనించిన కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ తన సేవా దృక్పథాన్ని చూపుతూ గది నుండి స్వయంగా జిల్లా పోలీస్ కార్యాలయం పార్కింగ్‌లో ఉన్న ఆమె వాహనం వద్దకు వెళ్లి ఫిర్యాదు స్వీకరించి, సమస్యను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు ఫిర్యాదులో – గత నెల 30న తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేస్తూ ఆవేదన వ్యక్తం చెయ్యగా, నిందితులపై వెంటనే చర్య తీసుకుని, ఈ సమస్యను పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ ఆమెకు హామీ ఇచ్చి పంపారు.

వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర – కాకినాడ : వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యనారాయణ జనరల్ నాలెడ్జ్ పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, దేశ రాజధానులు, దేశ నాయకుల ఫోటోలు గుర్తించడం వంటి అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలలో గెలుపొందిన గ్రూపులకు విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యనారాయణ స్వయంగా బహుమతులు కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశారు. తదుపరి విద్యార్థిని, విద్యార్థులచే పుస్తక పఠనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది నాగేంద్ర కుమార్, దుర్గా ప్రసాద్, అరుణ, ప్రియదర్శిని, స్థానిక పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు 64 మంది పాల్గొన్నారు.

ఆదిత్యలో ప్రశాంతంగా ఎపిఈఏపి సెట్

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఎపిఈఏపి సెట్–2025 ఆన్లైన్ ఎగ్జామ్స్ ప్రశాంతంగా జరిగినట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం ఆదిత్య యూనివర్సిటీ క్యాంపస్‌లో 535గాను 513మంది హాజరు కాగా 22 మంది హాజరు కాలేదు. సాయంత్రం 535 గాను 518 హాజరు కాగా 17 మంది హాజరు కాలేదు. ఈ ఎగ్జామ్స్‌కు చీఫ్ సూపరింటెండెంట్ ఆదిత్య ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ వ్యవహరించగా, ప్రొఫెసర్ ఎం. రాజబాబు, ప్రొఫెసర్ టి. శ్రీనివాసులు, ప్రొఫెసర్ వీరప్రసాద్ కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

ప్రాణాపాయంగా ఇసుక రవాణా

విశాలాంధ్ర –తాళ్లపూడి : తాళ్లపూడి మండలం లోని బల్లిపాడు ఓపెన్ రీచ్ ద్వారా రవాణా అవుతున్న భారీ వాహనాల వల్ల పుంతరోడ్డు పాడై చిత్తడిగా మారి రైతాంగం అనేక ఇక్కట్లు ఎదుర్కొంటు న్నామని గ్రామానికి చెందిన రైతు వల్లభనేని చంటి తదితరులు వాపోతున్నారు. బల్లిపాడు గ్రామంలో ఏటిగట్టుకు వెళ్లే పుంతరోడ్లో అనేక మంది రైతులకి పంట పొలాలు ఉన్నాయని, కనీసం పొలాలకు నడిచి వెళ్లేందుకు సైతం భయం కలుగుతోందని, భారీ వాహనాల రాకపోకలతో రహదారి మొత్తం బురద, గుంటలు మయ మై చిత్తడిగా మారిందన్నారు. బైక్ ల మీద వెళితే ఏ క్షణం లో ఏ లారీ కింద పడిపోతామో అనే భయాన్ని వెలి బుచ్చుతున్నారు. అధికారులు ఇబ్బందులను పరిశీలించి, రైతుల కష్టాలను తొలగించాలని కోరుతున్నారు.

మున్సిపల్ ఆదాయంపై దృష్టి సారించండి

-వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి
-మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణపై అశ్రద్ధ తగదు
-మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ధ్వజం
-ప్రజా సమస్యలపై వాడివేడిగా చర్చ

విశాలాంధ్ర – పెద్దాపురం : మున్సిపల్ ఆదాయలపై అధికారులు దృష్టి సారించాలే తప్పా మున్సిపల్ ఆదాయాలకు గండి కొట్టే విధంగా ఉండడం సరికాదని, ఆయా విభాగాల ద్వారా మున్సిపల్ ఆదాయాన్ని పెంచే విధంగా అధికారులు కృషి చేయాలని మున్సిపల్ కౌన్సిల్ డిమాండ్ చేసింది. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో చాలా సార్లు ఆయా కమ్యూనిటీ ఫంక్షన్ హాల్లో జరిగే ఫంక్షన్లకు భారీ స్థాయిలో సొమ్ములు వసూలు చేస్తున్నారని, తద్వారా మున్సిపాల్టీకి సైతం ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెయిన్‌రోడ్డు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై చర్యలు చేపడితే భవనాల అద్దెల ద్వారా మున్సిపాల్టీకి ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ చార్జీలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సోలార్ సిస్టమ్ను తొలుత మున్సిపల్ భవనానికి, పార్కుల వద్ద వినియోగించే విధంగా చర్యలు చేపడితే తద్వారా ఖర్చులు తగ్గించే అవకాశం ఉంటుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ రాజశేఖర్ కోరారు. దీనిపై కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి స్పందిస్తూ పన్నుల రూపంలో కాకుండా కమ్యూనిటీ భవనాలు, స్థలం మున్సిపాలిటీ కాబట్టి తప్పకుండా లీజు రూపంలో మున్సిపల్ ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సోలార్ సిస్టమ్మైన దృష్టి సారిస్తామన్నారు. కౌన్సిలర్ విడదాసరి రాజా మాట్లాడుతూ అమృత ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగంగా స్థానిక మనోజ్వేరువు అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. 14 వార్డులకు సంబంధించిన కుమ్మర వీధి శ్మశానవాటికి అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కౌన్సిలర్ సత్యభాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. శానిటేషన్ పనులు మరింత ఉధృతం చేసి వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. కౌన్సిలర్ గోకేడ అప్పారావు మాట్లాడుతూ పట్టణంలో మంచినీటి ఇబ్బందులు వల్ల ప్రజలు చాల అవస్థలు పడుతున్నారన్నారు. బోర్వెల్ రిపేర్ అయితే వెంటనే చెయించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు రోజులు గడుస్తున్నా నత్తనత్తనడకన వ్యవహరించడం సరికా దంటూ మండిపడ్డారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ పట్టణంలో టిడ్కో లబ్ధిదారుల గృహాలను అప్పగించడంలో నిర్లక్ష్యం తగదని, మిగిలిన లబ్ధిదారులకు ఫ్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి స్పందిస్తూ కొన్ని ఫ్లాట్లు నిర్మాణ దశ, మరికొన్ని రిపేర్లలో ఉన్నాయని, త్వరలోనే వాటిని లబ్ధిదారులకు అందించే చర్యలు చేపడతామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బొద్దు తులసి మంగతాయారు., వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి అధికారులు సేవలందించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలం, మరిడమ్మ జాతర సమయం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు ప్రజా సమస్యలపై వాడివేడిగా చర్చ సాగింది. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌రెడ్డికి సీనియర్ కౌన్సిలర్ రాజశేఖర్ ప్రజా సమస్యల పరిష్కారంపై వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ ప్రకాశరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఆదినారాయణ, కౌన్సిలర్లు ఆరెళ్ళి వీర్రాఘవులు, ముప్పన శ్యామలాంబ, పెంటకోట సత్తిబాబు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ. షేక్ రఫీ ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకోవడమే సాధి లక్ష్యం

విశాలాంధ్ర – జగ్గంపేట : ఆయా మండలాల్లోని బ్రతుకుతెరువు కోసం వచ్చి గుర్తింపు లేకుండా జీవనం కొనసాగిస్తున్న వారిని గుర్తించి వారికి రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అందజేయడమే సాధి అవగాహన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని పలువురు పేర్కొన్నారు. రంగంపేట ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం గండేపల్లి మండలం తహసీల్దార్ కార్యాలయంలో సాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం కోర్టు మండల న్యాయసేవ అధికారి కమిటీ చైర్మన్, 7వ జిల్లా కోర్టు జడ్జి చంద్ర మౌళేశ్వరి పాల్గొన్నారు. సుప్రీమ్ కోర్ట్ గైడ్ లైన్స్ ప్రకారం పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి, రంగంపేటలకు చెందిన ఎస్ఐ, ఎంఆర్వో,సీడీపీవో, ఎంఈవో, ఎంపిడివో, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈనెల 26వ తేదీ నుంచి జూన్ 26వ తేదీ వరకు పై నాలుగు మండలాల్లోని అనాధ పిల్లలను 0– నుండి 18 సంవత్సరాల వయసులోపు వారిని గుర్తించడంతో పాటు ఆధార్ కార్డు వచ్చేలా ఏర్పాటు చేయాలని వారికి ప్రభుత్వ పథకాలు అందేలా తగు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

ఇందులో భాగంగా నీలాద్రిరావుపేట శివారు బొమ్మలు తయారీ దారులు రాజస్థాన్ నుండి 30 ఏళ్ల క్రితం వలస వచ్చి నివాసం ఉంటున్న విషయాన్ని గుర్తించి స్థానిక ఆదిత్య హాస్పిటల్‌లో పుట్టిన 4 మంది పిల్లలకు ఆధార్ లేని వారికి ఇవ్వడానికి వారి పేర్లను తీసుకున్నారు. వారికి త్వరలోనే ఆధార్ ఇప్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో శ్రీనివాస్, ఎంపీడీఓ రాజా మనోహర్, జగ్గంపేట పీడీపీవో పూర్ణిమ, ఎంఈవో నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాదారుల అరెస్టు

విశాలాంధ్ర – జగ్గంపేట : గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపు లోకి తీసుకుని బొలెరో, బ్రేజా వాహనాలు, సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు పెద్దాపురం ఎస్డిపిఓ హరి హరిరాజు తెలిపారు. ఒరిస్సా లోని ముగ్గురు సహకారంతో చిత్రకొండ బేన్న భూపాల నుంచి మహారాష్ట్ర షిరిడికి వాహనాలలో అక్రమ రవాణా చేస్తుండగా కిర్లంపూడి మండలం కృష్ణారం హైవేలో టోల్ ప్లాజా వద్ద సోమవారం జగ్గంపేట సిఐ వైఆర్‌కె ఆధ్వర్యంలో మాటుగాసి పట్టుకున్నట్టు తెలిపారు. గంజాయి రవాణా కు పాల్పడిన వారిలో గోపాలపురం గ్రామానికి చెందిన ఎస్కే మస్తాన్(42), అల్లిపురం గ్రామానికి చెందిన ఎస్కే షరీఫ్(32), గ్రామవాసి కె.నాయుడు(28), నర్సీపట్నం బలిగొట్టం వాసి సతీష్(25), గోపాలపురానికి చెందిన అనామిక(35), కుమారి అనామి(17), 19 సంవత్సరాల బాలికలు సోమవారం అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. రవాణాలోని సంబంధిత వాహనాల్లో 75 ప్యాకెట్లలో 163.250 కేజీలు వీటి విలువ 8 లక్షల16 వేల250 రూపాయలు కాగా 40 వేల రూపాయల విలువచేసే 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జగ్గంపేట సిఐ వైఆర్కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిర్లంపూడి ఎస్సై సతీష్, జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, గండేపల్లి ఎస్సై, ఐదబ్బు కృష్ణారావు, బాబు జగ్గంపేట శ్రీను తదితరులు అక్రమ గంజాయి రవాణా దారులను పట్టుకున్నందుకు ఎస్డిపిఓ హరిహర రాజు పైవారిని అభినందించారు.

యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున

విశాలాంధ్ర – కాకినాడ : అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలోని మీడియా ప్రతినిధులకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు సోమవారం వివేకనంద పార్కులోని రెడ్ క్రాస్ యోగ కేంద్రంలో ఆయుష్ యోగ గురువు రమా పల్లవి నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో మీడియా వారు వార్తలు కవర్ చేయడంలో వత్తిడికి గురవుతుంటారని ఆ వత్తిడి నుండి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి మీడియాకు కల్పించిన ఈ సదవకాశాన్ని మీడియా వారు అందరూ వినియోగించుకుని తమ విధి నిర్వహణలో ఎదురవుతున్న ఒత్తిడిని యోగ ద్వారా తగ్గించుకోవాలని ఆయన కోరారు. ఈ యోగా శిక్షణ కార్యక్రమంలో పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర – అనపర్తి : స్థానిక రైజింగ్ హాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యవసర వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ మహిళా వృద్ధాశ్రమంలో కడియపు లంకకు చెందిన బక్కి విజయ శరత్ కుమార్. బక్కి సంధ్య ప్రియ దర్శిని పెళ్లి రోజు సందర్భంగా కుమార్తెలు రోషిణి, దేదీప్య సహకారంతో 25 కేజీల బియ్యం,పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా యోగాంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియ

-జేసీ రాహుల్ మీనా

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రతి ఒక్కరు ఉద్యమంలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం విధాన గౌతమి సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల అధ్యాపకులతో యోగాంధ్ర 2025 కార్యక్రమానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా..జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, పాఠశాల విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఇతర అధికారులతో కలిసి హాజరై కాకినాడ జిల్లాలో యోగాంధ్ర 2025 కార్యక్రమాల్లో భాగంగా చేపట్టే వివిధ కార్యక్రమాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ..జూన్ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నంలో యోగాంధ్రా పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో మే 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర 2025 క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నా మన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా కాకినాడలో జూన్ 7న ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా అధికార యంత్రం ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం https://yogandhra.ap.gov.in/#/ home/launchone, yogandhra.ap.gov.in లింక్ క్లిక్ చేయడం ద్వారా యోగ ఆంధ్ర రిజిస్ట్రేషన్ పూర్తి చేయవచ్చని ఆయన వివరించారు. సమావేశంలో ఆయుష్ వైద్య అధికారులు, హెచ్ సెక్షన్ విభాగ అధిపతి ఎం. జగన్నాథం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలలు లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

పేర్లకు ముసుగు సరికాదు

-పిజిఆర్ఎస్‌లో వైసీపీ నాయకుల ఫిర్యాదు

విశాలాంధ్ర - రాజానగరం : రాజానగరం గ్రామంలో ఏ నాయకుడు చేయని విధంగా గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో రావుల చెరువు ను అభివృద్ధి చేసి, దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు పేరుతో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులకు ముసుగులు తొడగడం సరికాదని వైసీపీ నాయకులు, వార్డు సభ్యులు ప్రగడ చక్రరావు(చక్రి) అన్నారు. దీనిలో భాగంగా గ్రామ వార్డు సభ్యులు ప్రగడ చక్రి, ఎక్కల నాగేశ్వరరావు, నాయకులు ఉప్పుల అబ్బు, మట్ట దుర్గారావు లు రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక (పిజిఆర్ఎస్) నందు సబ్ కలెక్టర్ చిన రాముడును కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా విశాలాంధ్రతో చరవాణిలో మాట్లాడుతూ తమ గ్రామంలోని మూడు శతాబ్దాల చరిత్ర కలిగిన రావుల చెరువు గత 20 ఏళ్లుగా పట్టించు కున్న నాయకులు లేరని,గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో ఎమ్.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులు ద్వారా కోటి ముప్పై లక్షల వ్యయంతో చెరువులోని పూడిక తీసి గోదావరి జలాల తో చెరువును నింపి చెరువు చుట్టూ రాతిగట్టు నిర్మించి చెరువుకు మహర్దశ కల్పించారని తెలిపారు. రావుల చెరువు గట్టు ప్రాంగణంలో పార్కు, వ్యాయామశాల, ఘాట్ నిర్మాణం చేశారన్నారు.వీటికి దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు పేరుతో బోర్డులను ఏర్పాటు చేశారని, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌కి కూడా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఇటీవలే ఆ పేర్లతో కూడిన అభివృద్ధి పనులకు స్థానిక పంచాయితీ కార్యదర్శి ముసుగులు తొడిగారని చెప్పారు. తక్షణమే ముసుగులు తొలగించాలని లేకుంటే తమ పోరు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజా రంజక పాలనందించిన వీర వనిత అహల్యా బాయి

విశాలాంధ్ర - అనపర్తి : వీర వనిత అహల్యా బాయి హెూల్కర్ త్రి శత జయంతి సందర్భంగా ఈనెల 31వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించ నున్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమ వారం స్థానిక కళ్యాణ మండపంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి అనంతరం మీడియాతో మాట్లాడుతూ అహల్యా బాయి సంఘ సంస్కర్తగా పేరొంది, రైతు బాంధవునిగా రైతుల సంక్షేమం కోసం కృషి చేసినట్టు తెలిపారు. ఆ రోజుల్లోనే ప్రజా రంజక పాలన అందించారని, మౌలిక వసతులు కల్పించి జల సంరక్షణ, రోడ్ల వసతులు కల్పించ డమే ప్రధాన కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మధుకర్ జి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్, బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, పలువురు మహిళా మోర్చా అధ్యక్షురాలు రజని తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి తాళ్లపూడి సమస్యలు

విశాలాంధ్ర-తాళ్ళపూడి: ప్రజల సమస్యల పై తాళ్లపూడి మండల బీజేపీ అధ్యక్షులు ఇందుగుల రామ కృష్ణ మొదటి సారిగా మండల ప్రజల సమస్యలపై తన గళాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఇసుక నిల్వలు తరలించే సమయంలో రోడ్ పై ఐడి ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగించాలని, తాళ్లపూడి బస్టాండ్‌లో బస్సులు నిలవడం లేదని, తాళ్లపూడి మెయిన్ రోడ్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఏళ్ల కాలంగా ఉన్న సమస్యల పట్ల స్పందించాలని కోరుతూ కలెక్టర్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ద్వారా వినతిపత్రాలు అందించారు.

టీడీపీ మహానాడుకు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

విశాలాంధ్ర - మామిడికుదురు : కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి మామిడి కుదురు టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్ళన్నారు. సోమవారం మామిడికుదురుకి చెందిన టీడీపీ నేతలు ఈలి శ్రీనివాస్, అప్పారి వేంకటేశ్వర రావు, సాపే ఏకాదశి, పెచ్చెట్టి భాస్కరరావు తదితరులు స్వచ్ఛందంగా వాహనాలను సమకూర్చుకుని ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరం పూర్తి కావడంతో ఈ మహానాడు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుందని పార్టీ శ్రేణులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మహానాడుకు తరలిన ఎమ్మెల్యే సత్యానందరావు బృందం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కడపలో మూడు రోజుల పాటు జరుగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు పార్టీ శ్రేణులతో తరలివెళ్లారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నుంచి సోమవారం ఆయన నియోజకవర్గంలోని నాలుగు మండలా లకు చెందిన నాయకులు, కార్యకర్తలతో కలిసి అధిక సంఖ్యలో వాహనాల్లో మహానాడుకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

కరపలో పందుల బెడద

విశాలాంధ్ర - కరప : కరప గ్రామ పంచాయతీ పరిధిలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తూ తోట పంటలను నాశనం చేస్తున్నాయి. పలువురు రైతులు పంచాయతీ కార్యాలయానికి వెళ్లి విన్నవించు కున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని రైతులు ఆవేదన చెందుతున్నారు. పందులు మేపుకునే వ్యక్తులు ఉదయం పూట దగ్గరుండి మేపుకొని రాత్రి సమయంలో వాటిని ఆవాసాల్లో బంధించాలని ఉన్నప్పటికీ పందుల యజమానులు బయట వదిలేయడం దారుణమని వాపోతున్నారు. ఆదాయమే మార్గంగా పందులను మేపుతూ తోట పంట రైతులను కన్నీరు పెట్టిస్తున్న పందుల యజమానులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.

muthoot HOUSING FINANCE

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముత్తూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం :యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12/ఎ 01, 13వ అంతస్తు, పరిణి క్రెసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, Email Id: authorised.officer@muthoot.com

అనుబంధం-4 [(నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల గడువు పూర్తయిన తర్వాత కూడా రుణగ్రహీత(లు) / హామీదారు(లు) బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8 తో చదివే చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు** రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

వ. నం.	ఎల్‌పిఎన్/రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి పడిన మొత్తం (రూ.లలో) భవిష్యత్తు వడ్డీ వర్తించును	స్వాధీనత తేదీ
1.	లోన్ ఎక్కౌంట్ నెం.11202119979 1.కామిరెడ్డి సరేష్ 2. కామిరెడ్డి విజయలక్ష్మి అలియాస్ కామిరెడ్డి విజయలక్ష్మి (Vijaya Laxmi), 3. కామిరెడ్డి రామస్వామి	30 డిసెంబరు-2024	13-డిసెంబరు-2024 నాటికి రూ.20,96,138.22/-	23-మే -2025
	హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: తూర్పు గోదావరి జిల్లా, జగ్గంపేట సబ్ రిజిస్ట్రీ, జగ్గంపేట మండలం, జె. కొత్తూరు గ్రామ పంచాయతీ బోర్డు ప్రాంతం, జె. కొత్తూరు గ్రామం, జిరాయితీ మెరక, ఎస్.నం. 151/1, ఎసి.3.96 సెంట్లు కలిగిన భూమిలో ఎసి.0.07 సెంట్లు = 339 చదరపు గజాలు. ఇందులో డి.నం.1-5తో ఉన్న ఆర్‌సిసి పైకప్పు భవనంతో పాటు297 చదరపు గజాలు కలిగి ఉన్న స్థలం = 248.31 చదరపు మీటర్ల యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: చింతల సూకరాజుకు చెందిన ఇల్లు - 45.6 అడుగులు పడమర: విక్రేతకు చెందిన మిగిలిన స్థలం - 45.6 అడుగులు ఉత్తరం: అడపా వీరనాగుకు చెందిన ఇల్లు - 60.9 అడుగులు దక్షిణం: పంచాయతీ సిమెంట్ రోడ్డు - 60.9 అడుగులు. పై సరిహద్దుల పరిధిలో అన్ని సాధారణ, అనుభవ హక్కులతో తలుపులు, ధర్వాజాలు, కిటికీలు, కప్ బోర్డులు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ మొదలైన వాటితో కూడిన ఆర్‌సిసి పైకప్పు భవనంతో సహా 297 చదరపు గజాలు కలిగిన స్థలం			

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన వివరించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై భవిష్యత్తు వడ్డీకి గాను **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత/లు/హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేదీ: 27 మే, 2025 **సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున**

పోలవరం ప్రాజెక్టు నష్టం కలిగించేలా ఇసుక తవ్వకాలు

విశాలాంధ్ర - సీతానగరం: పోలవరం ప్రాజెక్టుకు నష్టం కలిగించే విధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు అని పీజీఆర్ఎస్‌లో అర్జీ సమర్పించారు. సీతానగరం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు వచ్చాయని అన్నారు. వీటిలో ప్రధానంగా వంగలపూడి, సింగవరం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు పై వంగలపూడి గ్రామానికి చెందిన ఫణి బాబు అర్జీ సమర్పించారు. దీనిలో సింగవరం గ్రామ పరిధిలో అనుమతులు తీసుకొని వంగలపూడి గ్రామ పరిధిలో అక్రమంగా సుమారు 15 మీటర్ల లోతుకు ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు అని, 20 టన్నుల ఇసుక బిల్లులు తీసుకొని 40 టన్నులు ఇసుకను రవాణా చేస్తున్నారు అని, 30 టన్నుల సామర్థ్యం గల అర్ ఎన్ బి రోడ్లలో 50 టన్నులు ఇసుకను రవాణా చేయడం వల్ల రోడ్లు గోతుల మయంగా మారుతున్నాయన్నారు. సాయంత్రం 6 దాటికే ఇసుక తోలకాలు జరుపుతున్నారని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఈ అక్రమ మైనింగ్ వల్ల ప్రమాదంలో పడుతుందని అర్జీ సమర్పించారు. సీతానగరం, రాజ హేంద్రవరం ప్రధాన రహదారి నిర్మాణం చేసే సమయంలో డ్రైన్ వ్యవస్థ సరిగా లేక పోవడం వల్ల పంట పొలాలలోకి వరద నీరు చేరుతుందని జి జయకుమార్ కాటవరం గ్రామం నుండి అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల ద్వారానే రేషన్ సరఫరా

విశాలాంధ్ర - సీతానగరం: రేషన్ దుకాణాల ద్వారా మాత్రమే రేషన్ సరుకులు సరఫరా చేస్తారని తహసిల్దార్ ఎ. శ్రీనివాస్ అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు 2025 జూన్ 1వ తేదీ నుండి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో గల రేషన్ దుకాణాల్లో మాత్రమే రేషన్ సరుకులు పంపిణీ జరుగుతుందని అన్నారు. ప్రజలు అందరూ తమ తమ పరిధిలో గల రేషన్ దుకాణాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న రేషన్ సరుకులను తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

విశాలాంధ్ర-పెరవలి :రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన కుంపట్ల పెద వీరన్న (24) ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈయన కాకరపర్రులో తన పని ముగించుకుని ఆదివారం రాత్రి కాకరపర్రు నుంచి తీపర్రు తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వేదుల రామ్మూర్తి ఆశ్రమం వద్దకు వచ్చేసరికి లారీ రోడ్డుపై ఎటువంటి సిగ్నల్ , ఇండికేషన్ లేకుండా సడన్‌గా రోడ్డు మధ్యలోకి రావడంతో మృతుడు తన మోటార్ సైకిల్ పై వెళ్తూ ప్రమాదవశాత్తు లారీ వెనక వైపు బలంగా ఢీ కొనడంతో తలకు బలమైన గాయమై సంఘటనా స్థలంలోనే వీరన్న మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి కుంపట్ల వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్.ఐ యం. వెంకటేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

టీడీపీ సభ్యత్వంలో ముందంజ

విశాలాంధ్ర-కొవ్వూరు :కొవ్వూరు నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు మొత్తం 58,500 జరగగా అందులో దొమ్మేరు గ్రామంలో అధికంగా 2848 సభ్యత్వాలు జరిగి నియోజకవర్గం లో 39 గ్రామాలలో మొదటి స్థానంలో నిలిచిందని పార్టీ మాజీ కార్యదర్శి కే. వి. కే రంగారావు తెలిపారు. ఓటింగ్ పరంగా చూస్తే కొవ్వూరు టౌన్ సుమారు 34,500 ఓట్లు, చాగల్లు టౌన్ 17000 పైగా ఓట్లు,దొమ్మేరు 7,900 వరకు ఓట్లున్నాయి. నియోజకవర్గం పరంగా చూస్తే దొమ్మేరు 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు. సభ్యత్వం చేసుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి దుర్గేష్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర -పెరవలి :ప్రజల సమస్యల పరిష్కారం కొరకు అధికారులు శ్రద్ధ వహించాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం పెరవలి తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి దుర్గేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడకు వచ్చిన దరఖాస్తుదారులతో మాట్లాడారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడం మాత్రమే కాకుండా ఆ సమస్యలు త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు శ్రద్ధ వహించాలని అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉన్నందున ఆరోజు అధికారులు సెలవుతీసుకోవద్దని సూచించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పరిశీలించడం జరిగిందన్నారు.అధికారులు కొందరు మినహా అందరు అందుబాటులోనే ఉన్నారన్నారు.అందుబాటులో లేనివారిపై చర్యలు తీసుకొంటామన్నారు.

వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సోమవారం రాజమండ్రి అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎల్. చెంచురెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దర్శనం అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి చిత్ర పటం అందజేసారు. అలాగే ఆలయం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి పెదకాకానికి కొండ్రగుంట రవి, వర మల్లేశ్వరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. వారికి దేవస్థానం అధికారులు, అర్చకులు స్వామి వారి చిత్ర పటం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

కట్టా మురళికి పరామర్శ

విశాలాంధ్ర - అమలాపురం : పితృ వియోగంతో బాధపడుతున్న అల్లవరం రిపోర్టర్, ఎల్ఐసి ఏజెంట్ కట్టా మురళిని సోమవారం ఉదయం అమలాపురం ఎల్ఐసి ఏఓఐ యూనియన్ అధ్యక్షులు సానబోయిన వీరభద్రరావు, యూనియన్ ట్రెజరర్ దొమ్మేటి శివ స్వామి, మట్ట దుర్గా శ్రీనివాస్ గౌడ్, కదలి శ్రీనివాసరావు ఆయన ఇంటిదగ్గర కలిశారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. అలాగే ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్ జగన్‌కు గోల్డ్ మెడల్

విశాలాంధ్ర - కరప : కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి జగన్ పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించి తూర్పుగోదావరి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని సానా సతీష్ ఫౌండేషన్ తలాటం హరీష్ పేర్కొన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల సంబంధించి 66 కిలోల కేటగిరిలో పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించగా మేడిశెట్టి జగన్ ఈ పోటీలలో పాల్గొని పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్, బెంచ్ ప్రెస్‌లో గోల్డ్ మెడల్, స్ట్రాంగ్ మాన్ విన్నర్ ఛాంపియన్‌షిప్ సాధించారు. సానా సతీష్ ఫౌండేషన్ తలాటం హరీష్ జగన్‌కు తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, పలువురు జగన్ను అభినందించారు.

అక్రమ లేఔట్ పై ఫిర్యాదు చేస్తే మాకు సంబంధం లేదంటున్నారు..!

మండిపడిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర - పిఠాపురం : కాకినాడ జిల్లా పిఠాపురం అగ్రహారం బైపాస్ ఆనుకుని ఉన్న 153, 153/బిసర్వే నెం పంటభూములు, కాలువలు పై అక్రమ లేఔట్లు విచ్చలవిడిగా వేస్తున్నారని వాటిపై సంబంధించిన అధికారులు చర్యలు చేపట్టడం లేదని, కరెంట్ ఆఫీసు ఎదురుగా ప్రభుత్వ భూమిలో అక్రమ షాపులు కట్టారని సోమవారం పాడా కార్యాలయంలో ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ పిడి దృష్టికి తీసుకెళ్లారు. వారు సంబంధించిన అధికారులను అక్రమ లేఅవుట్లు ,షాపులు నిర్మూలన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రామకృష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ పేదవారి నివాసానికి సెంటు స్థలం ఇవ్వలేని ప్రభుత్వం, ప్రభుత్వం అధికార యంత్రాంగం ఎకరాల భూముల్లో అక్రమ లేఅవుట్‌వరం సాగుతున్న చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు చేస్తున్న తమ డిపార్టుమెంటుకు సంబంధంలేదంటూ సాకులు చెప్పి తప్పించుకుంటున్నారని అన్నారు. ఈ లేఔట్ వలన రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని మండిపడ్డారు. తక్షణమే అక్రమ లేఔట్లు షాపులు నిలపుదల చేయకపోతే రైతులతో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

రేషన్ డీలర్ల నియామకంపై హర్షం

విశాలాంధ్ర - ఆలమూరు : ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసే ఎండియు వాహనాలు రద్దుచేసి జూన్ 1వ తేదీ నుండి చౌక దుకాణాలు ద్వారా పంపిణీ చేసే నిర్ణయం ప్రభుత్వం తీసుకోవడంతో ఆలమూరు మండల రేషన్ షాప్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తూ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద రేషన్ డీలర్లు ఎమ్మెల్యే బండారును కలిసి సాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇంటింటికి రేషన్ పంపిణీ అని చెప్పి రేషన్ వాహనాలు ఏర్పాటు చేసినప్పటికీ ఆ వాహనాలు ఏదో ఒక ఏరియాలో ఉండి మాత్రమే రేషన్ ఇచ్చే వారని, లబ్ధిదారులు వాహనం వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వచ్చేదని చెప్పారు. వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక కూలి పనులు చేసుకునేవారు పని మానుకుని మరి వేచి చూస్తూ ఉండేవారని గుర్తు చేసుకున్నారు. అంతేకాక రేషన్ వాహనాల వల్ల ప్రభుత్వానికి అదనపు ఖర్చు తప్ప ప్రయోజనం పెద్దగా లేదన్నారు. అధిక శాతం ప్రజలు రేషన్ దుకాణాల వద్దే సరుకులు తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. రేషన్ డీలర్లకు పూర్వ వైభవం తెచ్చిన కూటమి ప్రభుత్వానికి పలువురు రేషన్ డీలర్లు ఎమ్మెల్యే సత్యానంద రావు ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సెక్రటరీ కాలా జయరాజు, కె శివ కుమార్, డి శ్రీని వాసు, ఎ. రామకృష్ణ, ఎస్. రామకృష్ణ, కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం

విశాలాంధ్ర - కాకినాడ : ఉదయం 6 నుండి 8 గంటల వరకు "యోగాంధ్ర-2025"లో భాగంగా మూడు లైట్ల జంక్షన్ నుండి ఎండోమెంట్స్ భవనం రోడ్డు వరకు యోగ శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక విభాగాధిపతులు, వార్డు సచివాలయ సిబ్బంది, యోగా ట్రైనర్లు, సుమరు 300 పైగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. యోగసాధన మరియు ఆరోగ్యజాగృతి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం నిర్వహణ కొరకు ట్రాఫిక్ శాఖ వారు సదరు రోడ్డు యోగా నిమిత్తము ట్రాఫిక్‌ని మళ్లించే ఏర్పాటు చేశారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. యోగ గురు, యోగ ట్రైనర్లు యోగాసనాలు, ప్రాణాయామం మరియు ధ్యానం వంటి అంశాలను ప్రదర్శిస్తూ ప్రజలకు సులభంగా అనుసరించగల మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్, కాకినాడ నగరపాలక సంస్థ వారు మాట్లాడుతూ, "యోగాంధ్ర కార్యక్రమం ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు ఒక గొప్ప దిశగా ముందడుగు," అని తెలియజేశారు. ప్రజల్లో ఆరోగ్యపరమైన చైతన్యాన్ని పెంచే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించబడాలని వారు తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

విశాలాంధ్ర - రాజోలు : సోమవారం తెల్లవారు జామున వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో గొలుసును గుర్తు తెలియని వ్యక్తి తెంపుకుని పరారయ్యాడు. బి సావరం గ్రామానికి చెందిన యాళ్ళ కుమారి రోజూ మాదిరిగానే తన తోటి కోడలు యాళ్ళ చిట్టెమ్మతో కలిసి ఇంటి వద్దనుండి బి సావరం ముసలమ్మ తల్లి గుడి వరకు వాకింగ్‌కు వెళ్ళి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వారి వెంట పడి యాళ్ళ కుమారిని మెడలో ఉన్న సుమారు మూడు లక్షలు విలువ చేసే 4 కాసుల బంగారు తాడు తెంపుకుని వెళ్ళి పోయాడు. వారు కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చే సరికి అతను సొంపల్లి కాల్వ గట్టు రోడ్డులో పెట్టుకున్న మోటార్ సైకిల్‌తో పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజోలు సీఐ నరేష్ కుమార్, ఎస్ఐ రాజేష్ కుమార్ సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహానాడులో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వండి

విశాలాంధ్ర - అమలాపురం : జరగబోయే తెలుగుదేశం మహానాడులో విశ్వబ్రాహ్మణులకు రాష్ట్రంలో ప్రత్యేకమైన స్థానాన్ని రాజకీయంగా కల్పించాలని, అమలాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వర్కర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజకీయపరంగా వెనుకబడి ఉన్నదని, ఇంతవరకు తెలుగుదేశం ప్రభుత్వంవిశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించలేదన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో గాని, ఎమ్మెల్సీ కోటాలలో గాని, రాజకీయ ప్రాధాన్యత కల్పించలేదని, రేపు జరగబోయే మహానాడులో విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాథమిక కల్పించే విధంగా మేనిఫెస్టోను ప్రకటించాలని ఆయన కోరారు. కేవలం విశ్వబ్రాహ్మణులు ఓటు బ్యాంకు గానే ఉంటున్నారని, విశ్వబ్రాహ్మణ చేతివృత్తిదారులకు 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేయాలని, విశ్వబ్రాహ్మణ కులాలకు రాష్ట్రవ్యాప్తంగా జనగణన చేయాలని, ఆర్థికంగా వెనుకబడి ఉన్న విశ్వబ్రాహ్మణ కులం చేతి వృత్తుల దారుల పని లేక ఇబ్బంది పడుతున్నారని, ఇటీవల బీసీ కార్పొరేషన్ లోన్లు ప్రవేశపెట్టి వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా మరుగున పడేలా చేశారని, ఏవిధంగా ఉపాధి లేకుండా పోతున్నారని, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ డైరెక్టర్లను నియమించి, చేనేత కార్మికుల మాదిరిగా విశ్వబ్రాహ్మణులకు రాయితీలుకల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు తగవు

విశాలాంధ్ర - కాజులూరు : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పై రామచంద్రపురం వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్య ప్రకాష్ అసత్య ఆరోపణలు తగవని, లోకేష్ ఫౌండేషన్ అధ్యక్షులు చుండ్రు వీర్రాజు చౌదరి అన్నారు. సోమవారం గొల్లపాలెం వీర్రాజు చౌదరి నివాసంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో అభివృద్ధిని చూసి వైసిపి నాయకులు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని, గత ప్రభుత్వహయాంలో అనేక అవకతవకలకు పాల్పడి అధికారులను జైలులో కూర్చోబెట్టే విధంగా చేశారన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ పై వైసీపీ ఇన్చార్జి సూర్యప్రకాష్ ఇసుక కుంభకోణంలోనూ, అనేక కుంభకోణాలలో మంత్రి హస్తం ఉందని ఆరోపించడం తగదు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అత్యధిక అధ్యక్షులు చవ్వాకులు నారాయణమూర్తి, సిరిపురం సాగునీటి సరఫరా అధ్యక్షులు పేపకాయల నారాయణరావు, క్లస్టర్ ఇంచార్జ్ వీరబ్రహ్మం, వల్లు అర్జున రావు, మేడిశెట్టి వివి సత్యనారాయణ, కోట తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇసుకపల్ల జాన్సివేణి, భర్త: ఇమ్మనుయేలు రాజు (లేటు)
మా తల్లి తండ్రిలు అయిన
జిల్లి సత్యవతి గారు, భర్త: జిల్లి సుబ్బారావు గారు (లేటు)
అమలాపురం తాలూకా, ఉప్పలగుప్తం మండలం,
చల్లపల్లి గ్రామం, జల్లివారిపేట, డోర్ నెం. 3-95 నందు
26-11-2019న మరణించినారు.
వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన.

సెల్ : 8332036596

ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

- పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలు సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలి
- 267 అర్జీలు రాక

విశాలాంధ్ర-ఏలూరు: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడేవారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హితవు పలికారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 267 దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రతిభావంతులు,దివ్యాంగులు వద్దకు వేదిక పైనుంచి కిందికి వచ్చి కలెక్టర్ వెట్రిసెల్వి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలు సావధానంగా విని వాటి పరిష్కార చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ వారితో పాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, దేవకిదేవి,శ్రీనివాస్ రెడ్డి, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కామవరపుకోట మండలం రామన్నపాలెంకు చెందిన వ్యక్తి అంగన్ వాడీ సూపర్ వైజర్ ఉద్యోగం ఇప్పిస్తా నని నమ్మించి రూ.3 లక్షలు తీసుకోవడం జరిగిందని,నేటి వరకు డబ్బులు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఈ విషయంలో న్యాయం చేయా లని టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంకు చెందిన తోట రమేష్ అర్జీనిచ్చారు. దీనిపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పందిస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడే వారిపై అప్రమత్తంగా ఉండాలని, అటువంటివారి ప్రలోభాలకు గురై మోసాలకు గురికావద్దని ప్రజలకు హితవు పలికారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యోగా పోటీలను జయప్రదం చేయండి

జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: యోగాంధ్ర ప్రచారంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగా పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. జూన్ 21న నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర ప్రచారం - యోగా పోటీ ప్రణాళిక" 2025 ను రూపొందించిందని దీనికి అనుగుణంగా కార్యాచరణ పగడ్బందీగా అమలు చేయాలని జాయింటు కలెక్టరు తెలిపారు. మే 21 నుండి జూన్ 21 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామం, వార్డు, మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో యోగా పోటీలను పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థులు, ప్రజలు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయంలో యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు.

ఇంటిని కబ్జాచేసి ఇంటిపన్నునే మార్చేశారు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

విశాలాంధ్ర - అమలాపురం : బ్రతుకు బాగోక గ్రామాంతరం వెళ్లిన వారి ఇంటిని కబ్జా చేయడమే కాక..పొజిషన్‌లో ఉండే సంబంధిత భూ యజమానుల ఆమోదం లేకుండానే రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆపై ఏకంగా ఇంటిపన్ను పేరునే మార్చి ఆ ఇల్లు తనదేనంటూ బెదిరింపులకు పాల్పడుతున్న సంఘటనపై బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో తమకు జరిగిన అన్యాయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు సానబోయిన శ్రీలక్ష్మి, ఆమె కుమారుడు కన్నీటి పర్యంతమయ్యారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లవరం మండలం బెండమూర్లంక గ్రామానికి చెందిన సానబోయిన సత్యనారాయణ సర్వే నెం.676/1 లోగల 2.5 సెంట్లుభూమిని 2012లో ఇదే గ్రామానికి చెందిన కాండ్రేగుల సత్యనారాయణ భార్య సత్యవతి దగ్గర కొనుగోలు చేశాడు. సత్యనారాయణకు భార్య, ముగ్గురు కుమారు లుండగా భార్య, ఇద్దరు కుమారులు మృతిచెందారు. మరో కుమారుడు అసలు ఎక్కడ ఉంటున్నాడో కూడా తెలియని పరిస్థితి. ఈక్రమంలోనే మామ సత్యనారాయణతోపాటు రెండోకుమారుడు సురేష్(మృతుడు) భార్య శ్రీలక్ష్మి, మనువళ్లతో కలిసి బెండమూర్లంకలో కొనుగోలు చేసిన ఇంటిలోనే ఉండేవారు. మామ సత్యనారాయణ కూడా మృతిచెందడంతో పరిస్థితి బాగోలేక శ్రీలక్ష్మి ఆ ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లిపోయింది. కళ్లముందే ఇల్లు ఖాళీగా ఉండడంతో ఆ ఇంటిపై శ్రీలక్ష్మికి వరుసకు చినమామ అయ్యే కుక్కల నాగేశ్వరరావు కన్నుపడింది. దీంతో ఇదే అదనుగా భావించిన నాగేశ్వరరావు ఇంటికి రంగులు వేయించి అద్దెకు ఇద్దామని నమ్మబలికి ఇప్పుడు కబ్జాచేశాడని బాధితులు వాపోయారు. 2022-23 వరకు ఇంటి పన్ను తన మామ సానబోయిన సత్యనారాయణ పేరుమీదే ఉందని, తమ పరిస్థితి బాగోలేక 2023-24లో ఇంటిపన్ను కట్టలేదని, ఇప్పుడు కడదామని పంచాయతీకి వెళితే అసలు ఇల్లు మీ మామ సత్యనారాయణ పేరుమీదే లేదని, ప్రస్తుతం ఆ ఇంటినెంబర్‌తో కుక్కల నాగేశ్వరరావు పేరుమీద 2024-25 సంవత్సరానికి కట్టి ఉందని పంచాయతీ కార్యదర్శి చెప్పాడని ఫిర్యాదులో తెలిపారు. దీంతో లబోదిబో మంటూ ఇంటికి వెళ్తే ఆ ఇంటితో మీకు అసలు సంబంధం లేదని ఇల్లు తనదేనని నాగేశ్వరరావు బెదిరిస్తున్నాడని కన్నీరుమున్నీర య్యారు. తమ కుటుంబీకులు ఎవ్వరూ లేకుండానే ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుని పంచాయతీలో ఇంటి పన్నుపేరుకూడా మార్పించేసుకున్నాడని, ఆ ఇంటి వారసులం తామే అయినప్పటికీ తమ అనుమతి లేనిదే రిజిస్ట్రేషన్‌తోపాటు ఇంటిపన్ను మార్పి వేయడంపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నారు.

ఎండియు వాహనాల రద్దు జీవోను ఉప సంహరించుకోవాలి

కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-రాజమండ్రి : ప్రజలకు ప్రతినెలా సక్రమంగా ఇంటింటికీ రేషన్ అందచేస్తున్న ఎండియు ఆపరేటర్ల వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎం డి యు ఆపరేటర్ల సంఘం తూర్పు గోదావరి జిల్లా నాయకత్వం లో స్థానిక కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలను సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె. రాంబాబు దండలు వేసి ప్రారంభించారు. దీనికి వైసీపీ నాయకులు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ రాష్ట్ర పచ్చదనం మరియు సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వారు బ్యాంకుల నుంచి రుణాలు పొంది వాహనాలు తీసుకుని ప్రతినెలా ఈఎంఐలు చెల్లిస్తూ ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్నారని తెలిపారు. దాదాపు 18 వేల మంది కార్మికులు వీధిన పడాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఎండియు ఆపరేటర్లను తక్షణ విధుల్లోకి తీసుకోవాలని, పిడిఎస్ నుంచి తొలగిస్తే ఉపాధి అవకాశాలు కల్పించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, మహిళా సమాఖ్య కార్యదర్శి పి.లావణ్య, ఏఐ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. త్రిమూర్తులు, యూనియన్ నాయకులు ఆర్.చిన్ని, హెచ్ దుర్గా ప్రసాద్, పిల్లి సుబ్రహ్మణ్యం, భాషా, హరికృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

అగ్రకులస్తుల దాడి

దళిత సంఘాల ధర్నా

విశాలాంధ్ర- అనకాపల్లి: జిల్లాలో నక్కపల్లి మండలం దొంకాడ దళితులపై అగ్రకులస్తుల దాడిని ఖండిస్తూ సోమవారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద దళిత సంఘాలు ధర్నా చేశాయి. గ్రామంలో పరోక్షంగా సాంఘిక బహిష్కరణ జరుగుతున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని నినదించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రం అందజేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ డి.సీహెచ్. రాజబాబు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ దొంగతనం దళిత యువకులపై మోపి అన్యాయంగా వారిపై దాడి చేసి రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కును అగ్రకులాలు కాలరాస్తున్నాయని మండిపడ్డారు. సంఘటన జరిగి పది రోజులు కావస్తున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకులస్తులు రోజురోజుకు పేట్రేగిపోతున్నారని, దీంతో దళితులు ఆందోళన చెందుతున్నారని, వెంటనే గ్రామంలో పోలీస్ పోస్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు. నామ మాత్రపు సెక్షన్లతో పోలీసులు కేసులు నమోదు చేసి అగ్రకులస్తులను కాపాడడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రాజా డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని సీపీఎం నేత ఎం. అప్పలరాజు అన్నారు. డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పి. లోవరాజు, కేవీపీఎస్ నాయకులు చిరంజీవి, బాధితులు అయినవిల్లి స్వర్ణ రాజు, గ్రామ పెద్దలు అప్పారావు, కన్నారావు, శివ పాల్గొన్నారు.

సిసిఆర్‌సి కార్డుల లక్ష్యాన్ని సాధిస్తాం

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో పంట సాగుదారు హక్కుల పత్రం (సిసిఆర్ సి), అన్నదాత సుఖీభవ పథకాల నిర్దేశించిన లక్ష్యాలను నిర్దిష్ట సమయంలో సాధిస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాల యం నుంచి వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి బి. రాజశేఖర్,రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు,వ్యవసాయశాఖ అధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఆర్ సి కార్డులు,అన్నదాత సుఖీభవ పథకాలపై సమీక్షించారు. ఈ పథకాల నిర్దేశించిన లక్ష్యాల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.రైతుల గుర్తింపు, నమోదులో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని పరిష్కరించుకుని నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి, జిల్లాలో 75 వేల సిసిఆర్ సి కార్డులు మంజూరు లక్ష్యంగా నిర్దేశించారన్నారు. వాటిని నిర్దేశించిన సమయంలో లక్ష్యాలను పూర్తి చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 4,03,093 రికార్డులు పరిశీలన లక్ష్యంగాగా ఇంతవరకు 3,60,731 రైతుల వివరాలు పరిశీలన పూర్తయిందన్నారు. లక్ష్యసాధనకు సంబంధిత శాఖలకు దిశా నిర్దేశం చేస్తూ సమన్వయంతో లక్ష్యాలు సాధిస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా,తదితరులు పాల్గొన్నారు.